## సిపిఎం సీనియర్ నేత మేకల రాయమల్లు మృతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సిపిఎం సీనియర్ నాయకులు మేకల రాయమల్లు (70) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం బాబు క్యాంప్‌లో శనివారం మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం నాయకులు సంతాపం తెలిపారు. రాయమల్లు మృతదేహంపై పార్టీ సీనియర్ నాయకులు గుగులోత్ ధర్మ ఎర్రజెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయమల్లు విద్యార్థి దశ నుండే పార్టీలో చురుకైన కార్యకర్తగా పని చేశారు. సింగరేణిలో సిఐటియు నాయకుడిగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా పని చేశారు. తుది శ్వాస వరకు సిపిఎంలో కొనసాగి అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారు. ఆయన ప్రజాశక్తి, నవతెలంగాణ దినపత్రికల అభివృద్ధికి పాటుపడ్డారు. చాలా కాలంపాటు ఏజెంటుగా సేవలందిస్తున్నారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, పట్టణ కమిటీ సభ్యులు డి.వీరన్న, నందిపాటి రమేష్, సీనియర్ నాయకులు గాజుల రాజారావు, కూరపాటి సమ్మయ్య, ఎంఎస్.ప్రకాష్, బిక్కులాల్ తదితరులు ఉన్నారు. రాయమల్లు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు.

## డెయిరీ ఫార్మింగ్‌ను ఆస్వాదించిన చిన్నారులు

**హైదరాబాద్ :** తెలంగాణా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ డి2సి డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ శనివారం చేవెళ్లలోని తమ ఫార్మ్ వద్ద చిన్నారులకు డెయిరీ ఫార్మింగ్ పట్ల ఓ అవగహన కార్యక్రమం నిర్వహించింది. దాదాపు 70 మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడంతోపాటు డెయిరీ ఫార్మింగ్‌లో కీలకాంశాల గురించి తెలుసుకున్నారు. మొట్టమొదటిసారిగా డెయిరీ ఫార్మ్‌కు వచ్చిన చిన్నారులు పూర్తి ఉత్సాహం, ఆసక్తితో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సిడ్స్ ఫార్మ్ ఫౌండర్ డాక్టర్ కిశోర్ ఇందుకూరి వ్యక్తిగతంగా ఈ చిన్నారులను కలుసుకోవడంతోపాటుగా క్యాంపస్ మొత్తం చూపించి, డెయిరీ ఫార్మింగ్‌లో ఉన్న లాభనష్టాల గురించి వివరించారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న స్టీవెన్‌సన్

## సమాజా మార్పుకు జరల్నిస్టులు కృషి చేయాలి

- ఓయు జర్నలిజం హెచ్ఒడి స్టీవెన్‌సన్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టులు అప్‌డేటా కావాల్సిన అవసరం ఉన్నదని ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగపు హెచ్ఒడి, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొ. కె. స్టీవెన్‌సన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సిఎఫ్ఆర్‌డి భవనంలో "జర్నలిజం ఇన్ ది డిజిటల్ ఏజ్" అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా జర్నలిజం వృత్తిలో అనేక మార్పులు వచ్చాయన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని పత్రికలు, ఛానళ్లు ముందుకు నడుస్తున్నాయన్నారు. వార్తా సేకరణ, ప్రసారంలో డిజిటల్ ఫార్మాట్‌కు ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. జర్నలిస్టులు కూడా ఆ దిశగా అడుగులు వేస్తేనే పోటీ రంగంలో సులువుగా ముందుకు వెళ్లగలుగుతారని తెలిపారు. అయితే ఇన్వెస్టిగేషన్ జర్నలిజం కూడా పెరగాలన్నారు. గతంతో పోల్చితే ప్రస్తుత జర్నలిజం వృత్తిలో పరిశోధనాత్మక రిపోర్టింగ్ తగ్గిందన్నారు. సమాజ మార్పుకు జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. ప్రజల నిత్య జీవితంలో ముడిపడిన అంశాలపై రీసెర్చ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌యుజె అధ్యక్షులు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బి జగదీశ్వర్, టి డబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య,పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థుల మృతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సిఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి టెలికాంనగర్‌కు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు స్థానిక విజయభారతి స్కూల్లో చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో నానక్‌రాంగూడ ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉన్న పటేల్‌కుంట చెరువు వద్దకు ఈతకు వెళ్లారు. మొదటగా షాభాజ్(15), దీపక్(12), పవన్(13) చెరువులోకి దిగారు. మిగతా ఆరుగురు ఒడ్డుపైనే ఉన్నారు. చెరువులోకి దిగిన ముగ్గురు చెరువు లోతు అంచనా వేయకుండా లోపలికి వెళ్లడంతో మునిగిపోయారు. దీన్ని గమనించిన బయట ఉన్న విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి కేకలు వేశారు. స్థానికులు అక్కడికి వచ్చి విద్యార్థులను రక్షించే ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

# సమస్యల పరిష్కారం కోసం పోరాటం

- మున్సిపల్ కార్మికులకు 21 వేలు వేతనమివ్వాలి
- ఉద్యోగ భద్రత, దళిత బంధు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం ఆందోళన
- మహాసభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర నాలుగవ మహాసభ హనుమకొండలోని అమృత గార్డెన్ కందుకూరి లాలు నగర్‌లో రెండో రోజు ప్రారంభమైంది ఈ సభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాసభ పలు తీర్మానాలు ఆమోదించింది. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో 2 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు (హైదరాబాద్, వరంగల్), 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 128 మున్సిపాల్టీలలో 64 వేల మంది కార్మికులు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ పే, డైలీవేజ్, తదితర పద్ధతుల్లో పారిశద్ధ్యం, పార్కులు, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైటింగ్ విభాగాల్లో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, జవాన్లు, ఎలక్ట్రిషియన్లు, పంపు ఆపరేటర్స్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, శానిటరీ జవాన్లు, ఎఫ్ఎస్ఎలుగా పనిచేస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతుల్లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులు పర్మినెంట్ అవుతారని, ఆ లోపు వేతనాలు పెంచుతారని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న కార్మికులు నిరాశే ఎదురైంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, ఉద్యోగ భద్రత, దళిత బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టుగానే తెలంగాణలోని మున్సిపల్ కార్మికులకు వేతనం రూ.21 వేలు పెంచాలి. వారి ఆత్మ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉంది' అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 7న మున్సిపాల్టీల వద్ద, 13న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేయాలని మహాసభ నిర్ణయించింది. ఉద్యోగ, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది.

**అమరవీరులకు ఘనంగా నివాళులు**

ప్రారంభానికి ముందు సిఐటియు జెండాను మున్సిపల్ సీనియర్ నాయకులు అంజయ్య ఆవిష్కరించారు అనంతరం అమరవీరులకు ప్రతినిధులు పూలతో నివాళులర్పించారు. మహాసభలకు అధ్యక్ష వర్గంగా జనగాం రాజమల్లు నాగమణి వహించారు. సౌహార్ద సందేశం కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి తపట్ల స్కైలాబ్ బాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి ఉప్పలయ్య రాగుల రమేష్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు పాలడుగు సుధాకర్, విష్ణు పాండు, మహేష్ కిషన్, ఆర్ వాణి, రజిత, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, సిఐటియు జిల్లా నాయకులు వేల్పుల సారంగపాణి, మెట్టు రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### మహాసభ ఆమోదించిన తీర్మానాలు

1. రాంకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి. జిహెచ్ఎంసి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలకు పెంచాలి.
2. పిఆర్‌సి ప్రకారం పెరిగిన కొత్త వేతనాలు ఎరియర్స్‌తో సహా అమలు చేయాలి.
3. పనిదినం 8 గంటలు అమలు చేయాలి. ఆదివారం, జాతీయ, రాష్ట్ర పండుగలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి.
4. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐని సమానంగా ఇవ్వాలి.
5. కనీస వేతనాల జిఒలను 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం సవరించాలి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 5 జిఒలను గెజిట్ చేయాలి.
6. కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి.
7. గ్రామ పంచాయితీ కార్మికులకు జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి.

# బిజెపికి భంగపాటు

- సిట్ నోటీసులపై స్టేకు హైకోర్టు నో

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఎమ్మెల్యేల ఎర కేసులో బిజెపి నేతలకు ఇచ్చిన నోటీసులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. నోటీసుల అమలును నిలిపేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. ఆ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ విచారణకు హాజరు కావాలని బిజెపి అగ్ర నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్, కరీంనగర్‌కు చెందిన న్యాయవాది శ్రీనివాస్‌లను ఆదేశించింది. దర్యాప్తు చేసే సిట్ వారిని వివరాలు రాబట్టాలే గానీ అరెస్టు చేయరాదని చెప్పింది. సిట్ అధికారులు ఢిల్లీలోని నాయకులకు నోటీసులు జారీ చేసేందుకు వెళితే అక్కడి పోలీసులు సహకరించడం లేదని ప్రభుత్వం దాఖలు చేసిన మరో అనుబంధ పిటిషన్‌ను కూడా హైకోర్టు విచారణ జరిపి ఢిల్లీ పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఢిల్లీ పోలీసులు సిట్ నోటీసులను అక్కడ ఉంటే బీ.ఎస్.సంతోష్‌కు అందజేయాలని చెప్పింది. హైకోర్టు ఆర్డర్ కాపీని ఢిల్లీ పోలీసులకు సిట్ అందజేయాలని చెప్పింది. ఈ మేరకు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21న సిట్ విచారణకు హాజరుకావాలని సంతోష్, శ్రీనివాస్‌లకు ఇచ్చిన నోటీసులను బిజెపి హైకోర్టులో సవాల్ చేసింది. నోటీసుల అమలును ఆపేయాలని కోరితే అందుకు హైకోర్టు నిరాకరించింది. సంతోష్, శ్రీనివాస్‌లను అరెస్టు చేయొద్దనీ, సిట్ దర్యాప్తునకు వారిద్దరూ హాజరుకావాలనీ, సిట్ దర్యాప్తును కొనసాగించవచ్చునని చెప్పింది. సిట్ దర్యాప్తును సింగిల్ జడ్జి రోజు వారీ పర్యవేక్షణ చేయాలనీ డివిజన్ బెంచ్ ఆర్డర్ ఇచ్చినట్టుగా స్పష్టత లేదని చెప్పింది. విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది.

బిజెపి తరఫున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ వాదించారు. బిజెపిని లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురిచేసేలా జాతీయ స్థాయిలో బిజెపికి మచ్చ తెచ్చేలా సిట్ దర్యాప్తు ఉండబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సంతోష్‌కు 41ఎ నోటీసు జారీ అయ్యాయనీ, అరెస్టులు చేసేందుకే ఈ నోటీసు ఇచ్చారని చెప్పారు. దర్యాప్తునకు హాజరుకాకపోతే అరెస్టు చేస్తామని అంటున్నారని తెలిపారు. సిట్ దర్యాప్తు రహస్యంగా ఉంచాలని హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా సిట్ నోటీసుల నుంచి నిందితుల విచారణ వరకు అన్నీ పత్రికల్లో, టీవీల్లో వచ్చాయన్నారు. ఇది కోర్టు ధిక్కారమే అన్నారు. కేసుతో సంబంధం లేని బిజెపి నేతలకు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయమన్నారు. సింగిల్ జడ్జి అనుమతి లేకుండానే సంతోష్ ఇతరులకు 41ఎ నోటీసు ఇచ్చారనీ, అవి చెల్లవన్నారు. అక్రమ నోటీసులపై స్టే మంజూరు చేయాలని, సంతోష్‌ను అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

దర్యాప్తులో భాగంగానే సంతోష్‌కు ఇతరులకు నోటీసులు జారీ అయినట్లుగా ప్రభుత్వం తరఫున ఏజీ ప్రసాద్ వాదించారు. నిందితులతోపాటు అనుమానితులకు కూడా నోటీసులు 41ఎ నోటీసులు ఇవ్వవచ్చునని చెప్పారు. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామచంద్రభారతి, కోరె నందుకుమార్, సింహయాజిలను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. నిందితులు, కేసు దర్యాప్తులో పొందిన సమాచారం ఆధారంగా ఈ కేసులో సంతోష్‌ను విచారణ చేయాలని సిట్ నిర్ణయించడాన్ని తప్పుపట్టక్కర్లేదని చెప్పారు. అంతా అమిత్‌షా, సంతోష్ చూసుకుంటారని కూడా ఫోన్ సంభాషణల్లో ఉందన్నారు.

**సిట్ లంచ్‌మోషన్ పిటిషన్**

ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసులో ఢిల్లీలోని బిజెపి నేతలకు నోటీసుల జారీ చేసేందుకు అక్కడి పోలీసులు సహకరించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ సిట్ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాన్ని శనివారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ జరిపారు. సిట్ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ, నోటీసు జారీ చేసేందుకు సిట్ అధికారులు వెళితే, తాము వేరే పనుల ఒత్తిడిలో ఉన్నామనీ, తాము సహకరించలేమని ఢిల్లీ పోలీసులు చెప్పారన్నారు. ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసుకు తమకు సంబంధం లేదని బిజెపి నేతలు చెబుతూనే హైకోర్టులో కేసుల మీద కేసులు వేస్తున్నారని తప్పుపట్టారు. గుడికి తడిబట్టలతో వెళ్లి ప్రమాణాలు చేస్తారనీ, ఇక్కడికి వచ్చి కేసులు వేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోళ్లకు కుట్ర జరిగినట్టుగా సిట్ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఢిల్లీ పోలీసులు సహకరించడం లేదని, ఇలా చేయడం సిట్ దర్యాప్తునకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని అన్నారు. నిజాలు నిగ్గు తేలాలంటే సిట్ దర్యాప్తు జరగాలన్నారు. వాదనల తర్వాత హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

## ఇక ప్రజాపోరు బాట

- ధాన్యం కొనుగోళ్ల కోసం దీక్షలు
- కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- సిఎస్‌కు వినతిపత్రం
- కార్యాచరణ ప్రకటించిన రేవంత్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రజాసమస్యలపై ప్రజాపోరు బాట పట్టాల్సిన అవసరముందని పిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. తెలంగాణలో పోడు భూములు, ధాన్యం కొనుగోళ్ల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టబోతున్నదని పిలుపునిచ్చారు. ఈ పోరాటాలను చాలా కీలకంగా భావించి పని చేయాలని కోరారు. సిఎల్‌పినేత భట్టి విక్రమార్క, ఎంపి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, సీనియర్ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, షబ్బీర్‌అలీ, అన్వేష్‌రెడ్డి, ప్రీతం, అయోధ్యరెడ్డి తదితరులతో కలిసి శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవంత్ జూమ్ సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న పోడు భూములు, భూమికి సంబంధించిన ఇతరాంశాలు, ధరణి పోర్టల్, ఓబీసీ, ఈ ఏడాది వానాకాలం మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం సేకరణ, క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులపై చర్చించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు సమస్యలపై పోరాడాల్సిన అవసరముందని చెప్పారు. ప్రకృతి విపత్తుల కారణంగా 15లక్షల ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారంతోపాటు పెట్టుబడి రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను సీలింగ్ ల్యాండ్ పేరిట ప్రభుత్వం పేదల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా టిఆర్ఎస్, బిజెపి నాటకాలాడుతున్నాయని విమర్శించారు. గతంలో కూడా నయీం కేసు, మాదక ద్రవ్యాల కేసు, ఆర్‌టిసి కార్మికుల ధర్నా వంటి అంశాలను వివాదాస్పదం చేశారని గుర్తు చేశారు.

**తెలంగాణలో బెంగాల్ తరహా రాజకీయాలు**

తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పశ్చిమ బెంగాల్ తరహా రాజకీయాలు చేయాలనుకుంటున్నారని రేవంత్ ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ పథకం కింద 47లక్షల మందికి రూ.25వేల కోట్లు చెల్లించాల్సి ఉన్న నేపథ్యంలో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఇక నుంచి అన్ని మండల కేంద్రాలు, జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఇందిరాపార్క్ వద్ద రెండు రోజులు దీక్ష చేపట్టాలని తెలిపారు. దశల వారీగా పోరాటాలు చాలా అవసరమనీ, వ్యవసాయం, రైతుల అంశాలు ఇప్పుడు చాలా కీలకమని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. తొలుత నియోజకవర్గాల్లో పోరాటాలు చేసి రైతులు, ఇతర వర్గాల నుంచి అభిప్రాయాలు, డిమాండ్లపై సీఎస్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించాలన్నారు. 32 జిల్లాల్లో ఆందోళనలు చేసిన తర్వాత గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్టు చెప్పారు. మునుగోడు ఎన్నికల్లో, భారత్ జోడో యాత్ర కోసం కష్టపడి పనిచేశారంటూ అభినందించారు.

## వికలాంగుల సంక్షేమానికి కృషి

- మంత్రి కొప్పుల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

డిసెంబర్ మూడున ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని మహిళా, శిశువికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకంలోనూ ఎస్‌సి వర్గాలకు చెందిన వికలాంగులకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. దేశంలోనే ఏ రాష్ట్రం చూపించని ఆదరణను వారి పట్ల తమ ప్రభుత్వం కనబరుస్తున్నదన్నారు. వికలాంగులకు మూడు వేల రూపాయలు పెన్షన్ అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సదుద్దేశంతో చూడాలన్నారు. వికలాంగులు ప్రతిపాదించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవ ఏర్పాట్ల కోసం ప్రతి జిల్లాకు రూ.50 వేలను విడుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ వాసుదేవ రెడ్డి శాఖ కార్యదర్శి దివ్య దేవరాజన్, డైరెక్టర్ శైలజ వికలాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ 'కష్టాలు'

- రికార్డులు.. ఆన్‌లైన్‌తో తిప్పలు
- ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఎక్కువగా పనులు
- నేడు అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర మహాసభ
- భువనగిరిలో ఏర్పాట్లు పూర్తి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

"ఏం ఉద్యోగమో ఏమో కానీ.. అన్ని.. ఇన్ని కష్టాలా.. ఉదయం నిద్ర లేచిన నాటి నుంచి.. రాత్రి నిద్రపోయే వరకు టెన్షన్, ఎప్పుడు.. ఏ రిపోర్టు ఇవ్వమంటారోనని భయం.. కొత్తగా ఇచ్చిన స్మార్ట్ ఫోన్ తిప్పలు అన్నీ ఇన్నీ కావు. అన్ని నివేదికలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆన్‌లైన్ నమోదు కష్టంగా మారింది. ఆపై సెంటర్లో పోషక ఆహారం పంపిణీ.. రివార్డులో నమోదు.. ఆపై ఆన్‌లైన్ చేయడం.. నిత్యం స్మార్ట్ ఫోనేతో.. పైగా బిఎల్ఓ, పల్స్ పోలియో, ఇతర ప్రభుత్వ డ్యూటీలతో సతమతమౌతున్నాం.. ప్రభుత్వ ఉద్యోగులకంటే ఎక్కువుగా అన్ని పనులూ చేస్తున్నాం.. ఇన్న చేసినా ప్రజాప్రతినిధుల ఒత్తిడిలు.. అధికారుల వేధింపులు తట్టుకోలేక పోతున్నాం. రోజూ మానసికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఈ ఉద్యోగం మాకు వద్దు." ఇదీ ఓ అంగన్‌వాడీ టీచర్ ఆవేదన.

ఇలా ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. రాష్ట్రంలోని అంగన్వాడీ వర్కర్లందరి మనోవేదన ఇదే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొనసాగే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో కొనసాగే ఈ వ్యవస్థలో కేంద్రం ఇచ్చే నిధులకు కోత పెడుతోంది. నిధులు ఇవ్వకుండా మొత్తం రాష్ట్రంపైనే నెట్టుతోంది. సెంటర్లకు పంపిణీ చేసే పోషకాహారం నాసిరకంగా ఉండటం వల్ల లబ్ధిదారుల నుంచి అంగన్వాడీ వర్కర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్గో, రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేయడంతో వాటిని తెచ్చుకునేందుకు సిబ్బంది కష్టాలు పడుతున్నారు. పైగా టిఎ, డిఎలు కూడా ఇవ్వడం లేదు. వీరితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నా కనీస వేతనం అమలు చేయడం లేదు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 149 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉండగా, మొత్తం 35,700 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 3989 మినీ అంగన్‌వాడీ సెంటర్లు. సుమారు 71,400 మంది టీచర్లు, ఆయాలు పని చేస్తున్నారు. వీటి పరిధిలో గర్బిణులు, బాలింతలు 4,57,643 మంది, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల వయసు గల పిల్లలు 10,34,562 మంది, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లలు 6,67,783 మంది ఉన్నారు. వీరందరికీ అంగన్‌వాడీ వర్కర్స్ సేవలు అందిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 18 ప్రాజెక్టులు ఉండగా, 4203 సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 4400 మంది వర్కర్లు పని చేస్తున్నారు.

**వర్కర్లు అందించే సేవలు..**

అంగన్‌వాడీ టీచర్ పోషక ఆహారం పంపిణీ, రికార్డులు నమోదు చేయాలి. గర్భిణీలు, పిల్లల బరువు, ఎత్తు, గ్రోత్ ప్రతి నెలా చేస్తుంటారు. కొత్తగా ఇచ్చిన సెల్ ఫోన్లో గ్రోత్, లబ్దిదారుల రిజిస్ట్రేషన్, టిహెచ్ఆర్ వంటి పనులు చేస్తున్నారు. బాలింతలు, గర్భిణీలకు పోషక ఆహారం అందించాలి. ఆరోగ్య పరిస్థితిపై నిత్యం పర్యవేక్షించి సూచనలు సలహాలు ఇవ్వాలి. వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి వారు ఆరోగ్యంగా ఉండే విధంగా బాధ్యత తీసుకుంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విరామం లేకుండా విధులు నిర్వహిస్తున్నార. పిల్లలను ఆటపాటలతో అలరించాలి. పైగా ప్రభుత్వ కార్యక్రమాలను వీరితోనే చేయిస్తూ ఉంటారు. ఆల్బెండజెల్ మందుల.. బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో మీరు ముందు భాగం ఉండి విధులు నిర్వహిస్తున్నారు. బిఎల్ఓగా విధులు నిర్వహిస్తూ ఓటర్ జాబితాలో సిద్ధం చేస్తూ ఉంటారు. పల్స్ పోలియో విధులు కూడా వీరితోనే చేయిస్తున్నారు.

**నేడు, రేపు రాష్ట్ర నాలుగో మహాసభ**

ఈ నెల 20, 21 తేదీల్లో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభ భువనగిరిలో జరగనుంది. మున్సిపల్ పరిధిలోని రాయగిరి గ్రామంలో సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఈ మహాసభ జరగనుంది. మహాసభకు తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం, అన్ని జిల్లాల నుంచి సుమారు 400 మంది అంగన్‌వాడీ వర్కర్లు ప్రతినిధులుగా హాజరుకానున్నారు. అంగన్‌వాడీల సమస్యలపై సుదీర్ఘంగా చర్చలు జరిపి వాటి పరిష్కారం కోసం చేపట్టబోయే ఉద్యమాల గురించి కార్యాచరణ రూపొందించనున్నారు.

**మహారాజశ్రీ, అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

ఓ.యస్. నెం. 8 / 2016

Between:-

దాలిపర్తి వెంకట శ్రీనివాస్ ...వాది

మరియు

పయ్యావుల రమేష్ & వగైరా ....ప్రతివాదులు

టు: పింగిళి గాయత్రి భర్త పి.ఎస్.ఆర్.మూర్తి నివాసం విద్యానగర్ రైల్వేస్టేషన్ దగ్గర, కిషోర్ నర్సింగ్ హెూమ్ ప్రక్కన, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రము.

పై నెంబరు దావాలో మీరు 3వ ప్రతివాది అయి ఉన్నారు. సదరు మీకు పై కోర్టు నుండి అనేక పర్యాయములు సమనులు చేయించనను మీరు తీసుకోనక కాలయపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయించవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు చేస్తు ది. 23.11.2022వ తేదిన వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు ఉ.10.30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపనలు తెలియచేసుకోనవలసి యున్నది. లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానం చేయుబడుని ఇందు మూలముగా తెలియచేయిడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**యం. రాంబాబు**
**బొపున. సుబ్రమణ్యేశ్వరరావు**
అడ్వకేట్స్
అవనిగడ్డ-521121

వాయిదా తేది: 23.11.2022 సెల్ 9949332270

**IN THE COURT OF THE HON'BLE PRINCIPLE DISTRICT AND SESSIONS JUDGE.**
**AT: SIDDIPET.**
**E.A. No. 34 OF 2022.**
**In**
**E.P.No. 44 OF 2019.**

**Between:**
Y. Suresh Babu and another. .... Decree Holder/ Plaintiff
AND
S.V. Krishna Rao, S.Padma and others ....J.D.Rs / Defendents

To,
Smt. Potluri Vijaya, D/o late S.V. Krishna Rao, W/o P.S.P.R.V. Prasad, Flat No. B-102, Sri SaiKrishna Apartments, Beside Saibaba Temple, Near Mary Stella College, **Vijayawada -520008,** Krishna District, Andhra Pradesh.
**.... AS J.D.R.8.**

To,
Smt. Kantamaneni Rajani, D/o late S.V. Krishna Rao, W/o K. Prasad, Plot No. 42, Bolineni Residency, Hasthinapuri Colony, SainikPuri, **Secundrabad-500094,** Telangana.
**.... as J.D.R.9.**

Please take notice that, **Y. Suresh Babu** S/o. late Y.Ankineedu,and another, filed an Execution Petition, E.P.44 of 2019, for execution of Judgement and Decree passed by the Hon'ble VI Addl.District and Sessions Judge, Siddipet in O.S. 2 of 2013, on 20/12/2016. The E.P. against the J.D.Rs, is on the file of the Hon'ble Principal District and Sessions Judge, Siddipet.

As L.Rs of deceased J.D.R.1, late S.V. Krishna Rao, Notices were sent to you by the Hon'ble Court, but you are evading receiving notices in the above case. On 09/11/2022, the Hon'ble **Court** was Pleased to order Public Notice in the news paper to secure your presence before the Hon'ble Court on 02/12/2022 at 10-30 am. Hence, please take notice that you are hereby required either to appear in Person or through Counsel on 02/12/2022 at 10-30 am before the Hon'ble Court, failing which the matter will be determined, on the material available on records.
**(By** the Order of the Hon'ble Court)

**S.CHENNA KESAVA SINGH,**
Advocate,
Dheeraj Law Associates,
# C-62, Road No.16, **HUDA Colony, Saroornagar, R.R.District -35.**
State Telangana
Mobile: 9293731773.

**IN THE COURT OF THE HON'BLE PRINCIPLE DISTRICT AND SESSIONS JUDGE.**
**AT: SIDDIPET.**
**E.A. No. 33 OF 2022.**
**In**
**E.P.No. 10 OF 2019.**

**Between:**
Nalluri Sudheer Babu .... Decree Holder/ Plaintiff
AND
S.V. Krishna Rao, S.Padma and others ....J.D.Rs / Defendents

To,
Smt. Potluri Vijaya, D/o late S.V. Krishna Rao, W/o P.S.P.R.V. Prasad, Flat No. B-102, Sri SaiKrishna Apartments, Beside Saibaba Temple, Near Mary Stella College, **Vijayawada -520008,** Krishna District, Andhra Pradesh.
**.... AS J.D.R.11.**

To,
Smt. Kantamaneni Rajani, D/o late S.V. Krishna Rao, W/o K. Prasad, Plot No. 42, Bolineni Residency, Hasthinapuri Colony, SainikPuri, **Secundrabad-500094,** Telangana.
**.... as J.D.R.12.**

Please take notice that, **N. Sudheer Babu** S/o Ramachandriah, filed an Execution Petition, E.P.10 of 2019, for execution of Judgement and Decree passed by the Hon'ble VI Addl.District and Sessions Judge, Siddipet in O.S. **7 of 2009, on 20/12/2016. The E.P.** against the J.D.Rs, is on the file of the Hon'ble Principal District and Sessions judge, Siddipet.

As L.Rs of deceased J.D.R.1, late S.V. Krishna Rao, Notices were sent to you by the Hon'ble Court, but you are evading receiving notices in the above case. On 09/11/2022, the Hon'ble **Court** was Pleased to order Public Notice in the news paper to secure your presence before the Hon'ble Court on 02/12/2022 at 10-30 am. Hence, please take notice that you are hereby required either to appear in Person or through Counsel on 02/12/2022 at 10-30 am before the Hon'ble Court, failing which the matter will be determined, on the material available on records.
**(By** the Order of the Hon'ble Court)

**S.CHENNA KESAVA SINGH,**
Advocate,
Dheeraj Law Associates,
# C-62, Road No.16, **HUDA Colony, Saroornagar, R.R.District -35.**
State Telangana
Mobile: 9293731773.

**మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

ఓ.యస్.నెం.285 / 2020

**పార్టీలు:**
వైట్ల శేషగిరి ...వాది

మరియు

పోలిన వెంకటేశ్వరరావు మరియు వగైరా ...ప్రతివాదులు

**టు:** 1) పోలిన వెంకటేశ్వరరావు, (తండ్రి) వీర్రాజు, హిందువు, వయస్సు 47 సం॥లు, డోరు నెం. 13-5-55/ఇ/31, బాలానగర్, అవంతీ నగర్, మూసాపేట, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

పై వాది ప్రతివాదులపై తనఖా బాకీ వసూలు నిమిత్తము దాఖలు చేసిన పై దావా మీ హాజరు నిమిత్తము పై కోర్టులో ది. 24-11-2022వ సం॥రం తేదీకు వాయిదా అయి వున్నది. కావున మీరు పై కోర్టు ఎదుట **ది.24-11-2022వ సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలియ పర్చుకోగలరు.** లేని యెడల పై దావా మీ పరోక్షమున నిర్ధారింపబడును.

**యమ్.ఆర్.సత్యసాయి (రాంబాబు)**
పిటిషనర్ తరపున అడ్వకేట్,
డోరు నెం. 86-11-11/1, వాడ్రేవునగర్,
తిలక్ రోడ్డు, రాజమహేంద్రవరం.

# ఫార్ములా రేస్...ట్రాఫిక్ కష్టాలు

- వాహనాదారుల అవస్థ
- ఎన్‌టిఆర్ మార్గ్, ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసుల సూచన

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ మార్గ్, ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్‌టిఆర్ మార్గ్, హుస్సేన్ సాగర్ తీరంలో ఫార్ములా రేస్ నేపథ్యంలో ఈ నెల 16 నుంచి ఎన్‌టిఆర్ మార్గ్, మింట్ కంపౌండ్ వైపు రాకపోకలను బంద్ చేశారు. ఈ ఆంక్షలు 20వ తేదీ(నేడు) రాత్రి 10 గంటల వరకు కొనసాగనున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఫార్ములా ఈ రేస్‌లు నెక్లెస్ రోటరీ నుంచి తెలుగుతల్లి జంక్షన్, ఓల్డ్ సెక్రటేరియట్ నుంచి ఎన్‌టిఆర్ గార్డెన్, మింట్ కంపౌండ్ మీదుగా ఐమాక్స్ వరకు కొనసాగుతుంది. దాంతో మూడ్రోజుల నుంచి భారీగా ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. నగరంలో సాధారణంగానే భారీగా ట్రాఫిక్ ఉంటుందని, అయినా.. ప్రభుత్వం నగర నడిబొడ్డులో ఫార్ములా రేస్‌లకు ఎలా అనుమతిస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఎన్‌టిఆర్ మార్గ్, ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా, ట్రాఫిక్ పోలీసులు మాత్రం వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచిస్తున్నారు. పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు ఇలా**

వీవీ విగ్రహం(ఖైరతాబాద్) వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపు ట్రాఫిక్ అనుమతి లేదు. వీవీ విగ్రహం వద్ద షాదాన్ కాలేజ్, రవీంద్రభారతి వైపు మళ్లించారు. బుద్ధభవన్, నల్లంపట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వాహనాలకు అనుమతి లేదు. ఈ వాహనాలను నల్లగుట్ట జంక్షన్ నుంచి రాణిగంజ్, ట్యాంక్‌బండ్ వైపు, రసూల్‌పురా, మినిస్టర్ రోడ్డు నుంచి నెక్లెస్ రోటరీ వైపు నల్లగుట్ట మీదుగా వచ్చే వాహనాలను, నల్లగుట్ట జంక్షన్ వద్ద రాణిగంజ్ వైపు, ఇక్బాల్ మినార్ నుంచి తెలుగుతల్లి జంక్షన్, ట్యాంక్ బండ్ వైపు వాహనాలకు అనుమతి లేకపోవడంతో వాహనాలు ఫ్లై ఓవర్‌పై నుంచి కట్టమైసమ్మ ఆలయం, లోయర్ ట్యాంక్‌బండ్ వైపు మళ్లించారు. అలాగే ట్యాంక్‌బండ్, తెలుగుతల్లి నుంచి నెక్లెస్ రోటరీ వైపు వాహనాలకు అనుమతి లేదు. తెలుగు తల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్ మినార్, రవీంద్ర భారతి జంక్షన్ వైపు, బీఆర్‌కే భవన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వచ్చే వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్‌మినార్, రవీంద్ర భారతి జంక్షన్‌కు మళ్లించారు. ఇక్బాల్ మినార్ జంక్షన్ నుంచి మింట్‌కంపౌండ్ వైపు వాహనాలను అనుమతి లేకపోవడంతో వాహనాలను రవీంద్ర భారతి జంక్షన్ వైపు అనుమతిస్తున్నారు. ఖైరతాబాద్ బడా గణేష్ ప్రాంతం వైపు నుంచి ప్రింటింగ్ ప్రెస్, నెక్లెస్ రోటరీ వైపు వాహనాలకు అనుమతిని నిరాకరించారు. ఈ దారిలో వచ్చే వాహనాలను రాజ్‌దూత్ లైన్‌లోకి మళ్లిస్తున్నారు. ఇదిలావుండగా అఫ్జల్‌గంజ్ నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలు, తెలుగు తల్లి ఫ్లై ఓవర్, కట్టమైసమ్మ, లోయర్ ట్యాంక్‌బండ్, బీబీఆర్ మిల్స్, కవాడిగూడ రూట్ల నుంచి అనుమతిస్తున్నారు.

## బిజెపి నేతగా వ్యవహరిస్తున్న గవర్నర్ తమిళిసై

- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బిజెపి నాయకులుగా వ్యవహరిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ఆమెకు సంబంధం లేని విషయం (ఎంపి అరవింద్ వ్యవహారం)లో గవర్నర్ జోక్యం చేసుకోవడం సమంజసం కాదని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేరళ, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో గవర్నర్‌ను ఉపయోగించి బిజెపి రాజకీయం చేస్తోందని పేర్కొన్నారు. అదే తరహా రాజకీయాలు ఇప్పుడు తెలంగాణలోనూ మొదలుపెట్టారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలేతప్ప కక్షపూరితంగా వ్యవహరించడం గవర్నర్‌కు తగదనీ, అలాంటి వ్యవస్థను రద్దు చేయాలంటూ సిపిఐ జాతీయ మహాసభ పిలుపునిచ్చిందని తెలిపారు. ఆ తరహాలోనే రానున్న కాలంలో ఆ వ్యవస్థ రద్దు కోసం ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల 7న చలో రాజ్‌భవన్ పిలుపునిచ్చామని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సిబిఐ, ఐటిని ప్రయోగించి ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కేంద్రం రాష్ట్రాలకు సహాయకారిగా ఉండి దేశ సమగ్రత అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. బిజెపి మతోన్మాద, ఫాసిస్టు విధానాలను ఎండగట్టేందుకు ప్రగతిశీల, లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులతో కలిసి పోరాడుతామని తెలిపారు.

## రాయమల్లు మరణం పట్ల తమ్మినేని సంతాపం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సిపిఎం పార్టీ నాయకులు సింగరేణి యూనియన్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన మేకల రాయమల్లు ఆకస్మిక మరణం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మతికి శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రాయమల్లు సింగరేణి ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేశారని పేర్కొన్నారు. అనేక ఆటుపోట్లను నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని వివరించారు. కొత్తగూడెం పార్టీ ఉద్యమంలో పాలుపంచుకున్నారని తెలిపారు. ఆయన పెద్దల్లుడు బి వెంకట్ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అనేక నిర్బంధాలు తట్టుకుని వారి కూతుళ్లు, తమ్ముల్లు, కుటుంబమంతా నేటికీ పార్టీతోనే ఉందని వివరించారు. రాయమల్లు అకస్మాత్తుగా మరణించడం విచారకరమని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు కమిటీ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

**చెరుపల్లి దిగ్భ్రాంతి**

రాయమల్లు మరణం పట్ల సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం పార్టీ, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని తెలిపారు. ఆయన మృతికి నవతెలంగాణ సీజీఎం పి ప్రభాకర్ సంతాపం ప్రకటించారు.

## మహిళా శక్తికి మారు పేరు ఇందిరా గాంధీ

**ప్రజాశక్తి - కల్చరల్**

స్త్రీలు దేశ పాలన కూడా సమర్ధవంతంగా చేయగలరని నిరూపించిన ఇందిరా గాంధీ మహిళా శక్తికి మారు పేరని ప్రముఖ మహిళలు కొనియాడారు. నగర్ కేంద్ర గ్రంథాలయంలోని వట్టికోట ఆళ్వార్ స్వామి ప్రాంగణంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఇందిరా గాంధీ జయంతి సభ జరిగింది. కేంద్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ప్రసన్న రామమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు గత ఐదు రోజులుగా జరుగుతోందని తెలిపారు. గ్రంథాలయాల ఆవశ్యకత ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు.

## ఎంపి అర్వింద్ నివాసంపై దాడి కేసులో నిందితులకు బెయిల్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

నిజామాబాద్ బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ నివాసంపై దాడి చేసిన తొమ్మిదిమంది టిఆర్ఎస్ కార్యకర్తలకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అర్వింద్ తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను శనివారం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం తొమ్మిదిమందికి సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ..కవిత పార్టీ మారతారని చెప్పడంతో పాటు మరికొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టిఆర్ఎస్ కార్యకర్తలు హైదరాబాద్ ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఆయన నివాసంపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే.

## ఆడబిడ్డలపై రాజకీయాలు మానుకో

- అరవింద్‌కు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హెచ్చరిక

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

బిజెపి తీరు పట్ల టిఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డలపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. కల్వకుంట్ల కవితపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోకపోతే నాలుక కోస్తామని హెచ్చరించారు. పసుపు బోర్డు పేరుతో ఓట్లు వేయించుకుని ఆ హామీని అరవింద్ గాలికొదిలేశారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలతో తనకు నిత్య సంబంధాలున్నట్టు అరవింద్ ఒప్పుకున్నారని విమర్శించారు. అరవింద్ తన తల్లిని సైతం రాజకీయాల్లోకి లాగడం దౌర్భాగ్యమన్నారు.

# 70 లేఖలు రాసినా స్పందన లేదు

- కృష్ణా బోర్డుపై తెలంగాణ తీవ్ర అసంతృప్తి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కృష్ణాజల వివాదాలపై మొదటి ట్రిబ్యునల్ తీర్పులోని అంశాలను అమలు చేయాలని కోరుతూ కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు 70లేఖలు రాసినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందనా లేదని తెలంగాణ ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. వాటిపై కెఆర్ఎంబి కానీ, కేంద్ర జలశక్తిశాఖ కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ కెఆర్ఎంబి ఛైర్మన్‌కు తెలంగాణ నీటిపారుదలశాఖ ఇఎన్‌సి మురళీధర్ శనివారం లేఖ రాశారు. ముఖ్యమైన ఏడు అంశాలను లేఖలో పేర్కొని, 70లేఖలకు సంబంధించిన వివరాలను కూడా అందులో పొందుపర్చారు.

తాగునీటి కోసం తీసుకున్న జలాల్లో 20శాతం మాత్రమే లెక్కించాలని ట్రిబ్యునల్ చెబుతోందని, ఈ విషయాన్ని పలు లేఖల్లో పేర్కొన్నప్పటికీ బోర్డు ఎప్పుడూ అమలు చేయలేదని తెలిపింది. ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఏడాదిలో కేటాయించిన జలాల్లో మిగిలిన నీటిని వచ్చే ఏడాదికి క్యారీ ఓవర్ చేయాల్సి ఉంటుందని, దీనిపై పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి స్పందనా లేదని పేర్కొంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య 2015, 2017 సంవత్సరాల్లో అడ్ హక్ ప్రాతిపదికన మాత్రమే కేటాయింపులు చేశారని, తెలంగాణకు 70శాతం నీటిని కేటాయించాల్సి ఉందని తెలిపింది. రెండో ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50శాతం అయినా కొనసాగించాలన్న తెలంగాణ విజ్ఞప్తిని పట్టించుకోలేదని, ఛైర్మన్ ఏకపక్ష నిర్ణయాన్ని 16వ బోర్డు సమావేశంలో తీవ్రంగా వ్యతిరేకించినట్లు పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల రూల్ కర్వ్ ఖరారు కోసం సమాచారం, వివరాలు ఇవ్వాలని కేంద్ర జలసంఘాన్ని, బోర్డును కోరినా ఇవ్వలేదని లేఖలో గుర్తు చేశారు. చెన్నై తాగునీటి సరఫరా కోసం 1976, 77లో ఇచ్చిన ఒప్పందాలకు లోబడి రూల్ కర్వ్ ఖరారు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. పోలవరం నుంచి గోదావరి జలాలను కృష్ణాకు మళ్లించేందుకు అనుమతులు ఇచ్చినప్పటికీ రూల్ కర్వ్ సవరించలేదని వివరించారు. తెలంగాణకు జలవిద్యుత్ ఉత్పత్తి చాలా అవసరమని.. శ్రీశైలం, నాగార్జునసాగర్ వద్ద జలవిద్యుత్ ఉత్పత్తి రూల్ కర్వ్ సవరణ చేయాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. స్పిల్ వే ద్వారా విడుదల చేసే నీటిని లెక్కించరాదన్న ఏపి ప్రతిపాదన తమకు అంగీకారం కాదని పలుమార్లు చెప్పినప్పటికీ ఆర్ఎంసీ పట్టించుకోలేదని తెలంగాణ పేర్కొంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కాల్వలపై రియల్ టైం డేటా అక్విజేషన్ సిస్టం ఏర్పాటు చేయాలని మరోమారు కోరింది. ఆర్‌డిఎస్ ఆనకట్ట ఆధునీకరణ పనులు సాగకుండా ఏపి పదేపదే ఆటంకాలు సృష్టిస్తోందని... ఈ విషయమై పలుమార్లు లేఖలు రాసినట్లు పేర్కొంది. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఆర్‌డిఎస్ కుడికాల్వపై అనుమతుల్లేకుండా ఏపి చేపట్టిన పనులు నిలువరించాలని, అప్పటి వరకు డీపీఆర్‌ను పక్కన పెట్టాలని కోరినట్లు గుర్తు చేసింది. పలు అంశాలు ఇంకా పరిష్కారం కాలేదన్న తెలంగాణ... వాటన్నింటిని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి అమలు చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డును కోరింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏవైనా ఆదేశాలు అవసరమైతే వారి దృష్టికి తీసుకెళ్లాలని కెఆర్ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## కాంగ్రెస్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి బహిష్కరణ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డిపై వేటు పడింది. పార్టీ నుంచి ఆయనను బహిష్కరిస్తూ పిసిసి తీర్మానించింది. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సమా వేశమైన పిసిసి క్రమశిక్షణా సంఘం ఈ మేరకు శనివారం నిర్ణయం తీసుకుంది. శశిధర్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ జి చిన్నారెడ్డి వెల్లడించారు. అయితే శశిధర్‌రెడ్డి బిజెపిలో చేరుతున్నట్టు వార్తలొస్తున్నాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, సీనియర్ నేత డీకే అరుణతో కలిసి ఆయన శుక్రవారం రాత్రి కేంద్ర మంత్రి అమిత్‌షాతో ఢిల్లీలో సమావేశమైన విషయం తెలిసిందే.

గత రెండు రోజులుగా అక్కడ ఉన్న ఆయన... పలువురు బిజెపి నేతలతో సంప్రదింపులు జరిపినట్టు పిసిసి నేతలు తేల్చారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ మారుతున్నట్టు వచ్చిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఢిల్లీకి రావడం కొత్తేమీ కాదనీ, మనవడి స్కూల్ ఫంక్షన్‌లో పాల్గొనడానికి వచ్చానని తెలిపారు. 'నేను ఇంకా రాజకీయాల్లోనే ఉన్నా. రిటైర్డ్ కాలేదు. నేను ఢిల్లీకి వచ్చిన విమానంలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. బిజెపిలో చేరడానికే నేను ఢిల్లీకి వచ్చానన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదు' అని వెల్లడించారు.

## కనీస వేతనాలు అమలు చేయరా?

- సెక్యూరిటీ గార్డుల మహాసభలో వక్తలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రధాని మోడీ ఏలుబడిలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులకు భంగం వాటిల్లుతోందని సిఐటియు రాష్ట్ర నేత వంగూరి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటి సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సిఐటియు)రాష్ట్ర రెండో మహాసభ యూనియన్ అధ్యక్షులు సారిక రాము, పి వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వంగూరి రాములు మాట్లాడుతూ.. రెండోసారి బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. వీటికి తోడు మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నదని చెప్పారు.

దేశ ఆర్థిక రంగంతో పాటు, పారిశ్రామిక, సేవారంగాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయన్నారు. ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందని గుర్తుచేశారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోను అమలు చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని తెలిపారు. కార్మికులకు చట్టబద్ధ సౌకర్యాలు దక్కటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు మార్కెట్ కమిటీల నుండే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరికి థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచే వేతనాలు చెల్లించాలన్నారు. ఏజెన్సీలను రద్దు చేసి సెక్యూరిటీ గార్డులను పర్మినెంట్ చేయాలనీ, మార్కెట్ల ద్వారానే ఈపిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికశాఖ విడుదల చేసిన జీఓ నెం.21ని గెజిట్ చేసి సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రంగాలకు ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చినా వాటికి గెజిట్ చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని తెలిపారు. యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ ఆయా జిఒలను విడుదల చేయడం లేదని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి. మధు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బరితెగించి కార్మిక వ్యతిరేక విధానాలను చేపడుతున్నదని విమర్శించారు. మాటల్లో జాతీయత, దేశభక్తి.. గురించి వల్లిస్తూ.. ఆచరణలో విధ్వంసకర విధానాలను అమలు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు అప్పనంగా అమ్మేస్తున్నదని తెలిపారు. మహిళలు, శ్రామిక మహిళల హక్కులకు విఘాతం కల్గిస్తున్నదనీ, ప్రజాస్వామ్య, పౌర హక్కులను కాలరాస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి విదేశీ, స్వదేశీ బహుళజాతి సంస్థలకు కార్మికవర్గాన్ని బలి చేస్తున్నదని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సెక్యూరిటీ గార్డులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

అనంతరం నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. గౌరవాధ్యక్షులు వంగూరు రాములు (సిఐటియు రాష్ట్ర కేంద్రం), అధ్యక్షులు తుమ్మల సాంబయ్య (వరంగల్), వర్కింగ్ ప్రెసిడెంట్ సారిక రాము (ఖమ్మం), ఉపాధ్యక్షులు గొంగిడి లక్ష్మణ్ (సిద్ధిపేట), ఐలీ సదయ్య (భూపాలపల్లి), పి. వెంకన్న (మంచిర్యాల), బి. వెంకట నారాయణ (మహబూబాబాద్), ఎండి. ముస్తాక్ (ఖమ్మం), ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న (సిఐటియు రాష్ట్ర కేంద్రం), సహాయ కార్యదర్శులుగా పి. రాము (మహబూబాబాద్), ఎస్. కుమార్ (ములుగు), సుదారపు రమేష్ (భద్రాద్రి కొత్తగూడెం), మహేందర్ రెడ్డి (సిరిసిల్లా), ఎండి. సాయబ్ హుస్సేన్ (ఆదిలాబాద్), వై. రామాంజయ్య , ఏడుకొండలు, కోశాధికారిగా జె. జనార్ధన్ మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## ఓయూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మంత్రికి సిపిఎస్, పెన్షన్ సాధన కమిటీ వినతిపత్రం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఓయూ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ఓయూలో బాలుర హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు శనివారం క్యాంపస్‌కు వచ్చిన మంత్రికి సిపిఎస్, పెన్షన్ సాధన కమిటీ సభ్యులు తమ సమస్యలను వివరించారు. 20 ఏండ్లుగా టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. వీటన్నింటిపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యలను సావధానంగా విన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సిపిఎస్ అమలుతోపాటు పీఆర్సీ బకాయిలు త్వరలోనే ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ సాధన కమిటీ నుంచి ప్రొ.సూర్య దనుంజయ్, ప్రొ.మల్లేశం, ప్రొ.సారస్వతమ్మ, డా.చెలమల్ల శ్రీనివాసు, డా. రాధాకృష్ణ, ప్రొ.శశికాంత్, డా.సీహెచ్. వెంకటేశ్వర్లు, డా. బి.రవీందర్ రెడ్డి, డా. జె.వెంకటేశ్వర్లు, మేది శ్రీనివాస్, ఓయూ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, టెక్నికల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, నాగరాజు, ఓయూ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అక్బర బేగ్, విజయ్ కుమార్, రవి, భూంరావ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్రికలు సజీవంగా ఉంటేనే సమాజానికి మేలు

- ఈటల రాజేందర్

**ప్రజాశక్తి - కల్చరల్**

పత్రికలు, ప్రజా సంఘాలు సజీవంగా ఉన్నంత కాలం సమాజం చైతన్యవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలో పాట, కవిత్వం గొప్ప సంపదని, పత్రికలకు ఆదరణ కూడా ఎక్కువేనని ఆయన పేర్కొన్నారు. శ్రీత్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై శనివారం జరిగిన ఆదర్శ కిరణం నూతన మాసపత్రిక అవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా రాజేందర్ పాల్గొని పత్రికను అవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ బడుగు బలహీన వర్గాల రాష్ట్రమని, వృత్తి కులాలకు, పెద్ద కులాలతో సమప్రాధాన్యత కోసం పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. దేశంలో కుటుంబ పాలన నుంచి విముక్తి, బడుగు వర్గాలకు గుర్తింపు పొందుతున్న వాతావరణం కనిపిస్తోందన్నారు. అధ్యక్షత వహించిన పత్రిక సంపాదకుడు బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ వృత్తి కులాల బడుగు వర్గాల గళం ఆదర్శ కిరణం అని పేర్కొన్నారు. పత్రిక నిరాటకంగా నడిపేందుకు అందరి సహాయ సహకారాలు కావాలని కోరారు. వేదికపై పార్లమెంట్ మాజీ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్, పూర్వ శాసన సభ్యుడు ఏనుగు రవీందర్ రెడ్డి, సుధాకర్, కార్పొరేటర్ మహాలక్ష్మి దంపతులు, ధనుంజయ, కవి చిక్క రామ దాసు, గడ్డమీది అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోనూ పాత పెన్షన్ అమలు చేయాలి

- ఎన్ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పంజాబ్‌లోని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయడానికి ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ సిన్హా నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సందర్భంగా నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎన్ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ, తెలంగాణ సిపిఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమార్థం పాత పెన్షన్ అమలు చేయడం పట్ల పంజాబ్ సిఎం భగవంత్ మాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేసే ఆరో రాష్ట్రంగా తెలంగాణ కావాలని ఆకాంక్షించారు. గుజరాత్ ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు ఆయా మ్యానిఫెస్టోల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేస్తామంటూ హామీ ఇచ్చాయని గుర్తు చేశారు.

## జీస్క్వేర్ ప్రచారకర్తగా ఎంఎస్ ధోనీ

**హైదరాబాద్ :** రియల్ ఎస్టేట్ సంస్థ జీస్క్వేర్ తమ బ్రాండ్ అంబాసీడర్‌గా ప్రముఖ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీని నియమించుకుంది. ఎంఎస్ ధోనీ భాగస్వామ్యంతో దక్షిణాదిలోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, కోయంబత్తూరులలో మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. దేశంలో ఇప్పటి వరకు తాము 60కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేశామని జీస్క్వేర్ హౌసింగ్ సిఇఒ ఈశ్వర్ ఎన్ తెలిపారు. దోనితో భాగస్వామ్యం తమ వ్యాపారాన్ని విస్తరించడానికి, బ్రాండ్ బలోపేతానికి దోహదం చేయనుందన్నారు.

# సర్కారు బడుల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం

- 47 శాతం పాఠశాలల్లో హెచ్‌ఎంలు, టీచర్ల ఖర్చుతోనే నిర్వహణ
- 277 స్కూళ్లలో ప్రారంభం కాని మన ఊరు-మనబడి పనులు
- సెంట్రలైజ్డ్ కిచెన్లున్న ప్రాంతాల్లో 30 నుంచి 60 శాతమే
- తెలంగాణ పౌర స్పందన వేదిక సర్వేలో వెల్లడి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సర్కారు బడుల్లో పారిశుధ్యం నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. 47 శాతం పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే ఖర్చును భరించి పారిశుధ్యం నిర్వహణను చేపట్టడం గమనార్హం. 2.2 శాతం బడుల్లో మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, 50.8 శాతం స్కూళ్లలో గ్రామపంచాయతీల సహకారంతో పారిశుధ్యం పనులు సాగుతున్నాయి. తెలంగాణ పౌర స్పందన వేదిక (టిపిఎస్‌వి) ఆధ్వర్యంలో 33 జిల్లాల్లోని 1,639 ప్రభుత్వ పాఠశాలల్లో గతనెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్వే చేపట్టింది. ఉపాధ్యాయుల కొరత, మన ఊరు-మనబడి పనుల పురోగతి, పారిశుధ్యం పరిస్థితి, మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థుల సంఖ్య వంటి అంశాలపై ఈ సర్వేను చేసింది. ఇందులో సర్కారు బడుల్లో ఉన్న సమస్యలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. 1,043 పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్టు ఈ సర్వేలో తేలింది. 498 ఎస్జీటీ, 266 స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, 191 స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్, 138 స్కూల్ అసిస్టెంట్ తెలుగు, 132 స్కూల్ అసిస్టెంట్ హిందీ, 109 స్కూల్ అసిస్టెంట్ గణితం, 108 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, 73 స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు అవసరమున్నట్టు వెల్లడైంది.

**14 బడుల్లోనే వంద శాతం పనులు పూర్తి**

రాష్ట్రంలోని 1,639 స్కూళ్లలో సర్వే చేస్తే 910 పాఠశాలలు 'మన ఊరు-మనబడి' కార్యక్రమానికి ఎంపికయ్యాయి. వాటిలో 14 పాఠశాలల్లోనే వంద శాతం పనులు పూర్తి కావడం గమనార్హం. మిగిలిన 896 స్కూళ్లలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇందులో 65 పాఠశాలల్లో 75 శాతం, 87 స్కూళ్లలో 50 శాతం, 317 బడుల్లో 25 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే 277 పాఠశాలల్లో ఇంకా పనులే ప్రారంభం కాకపోవడం గమనార్హం. 88 శాతం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీల ద్వారానే వండి పెడుతున్నారు. అక్కడే వండి వేడి, వేడిగా వడ్డిస్తున్న బడుల్లో 92 శాతం నుంచి వంద శాతం విద్యార్థులు తింటున్నారు. కానీ సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా సరఫరా చేస్తున్న పాఠశాలల్లో మాత్రం 30 శాతం నుంచి 60 శాతం వరకు విద్యార్థులే భోజనం చేస్తున్నారు. మిగిలిన విద్యార్థులు ఇంటినుంచే భోజనం తెచ్చుకుని తింటున్నారు. ఉదయం సరాఫరా చేసిన అన్నం మధ్యాహ్నం తినే సమయానికి రుచికరంగా ఉండడం లేదంటూ ఎక్కువ మంది విద్యార్థులు వాపోయారు. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో పలు సమస్యలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సతమతమవుతున్నారు.

**సీఎం సమీక్షించాలి : టిపిఎస్‌వి డిమాండ్**

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం నిర్వహణ, ఇతర సమస్యలపై ముఖ్యమంత్రి కెసిఆర్ సమీక్షించాలని టిపిఎస్‌వి అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల కొరత లేదంటున్న పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ అంశాలపై స్పందించాలని కోరారు. మన ఊరు-మనబడి కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని సూచించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరాపై డిఇఒలు సమీక్షించాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని ఏజెన్సీల ద్వారానే వండితే ఎక్కువ మంది విద్యార్థులు తింటారని తెలిపారు.